# డబ్బులొచ్చే పాట

**-ఆకెళ్ళ గిరిజ**

చిన్నారులు శశి, హైమ ఇద్దరికీ సంగీతం అంటే అభిరుచి ఉంది. అది గమనించి వాళ్ళడాడీ ఇద్దర్నీ మ్యూజిక్ క్లాసులకి పంపిస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం వాళ్ళమ్మమ్మ ఇద్దర్నీ సంగీతం క్లాసులకి తీసికెళ్ళి తీసుకొస్తూంటుంది.

శశి, హైమ సరిగమలూ, తాళాలూ, స్వరాలూ, జంటస్వరాలూ వగైరా సంగీత సుధని ఆస్వాదించడం మొదలెట్టారు.

పదేళ్ళ శశి, ఏడేళ్ళ హైమల సంగీతసాధన ఆ ఇంట్లో కిటికీలకీ, గోడలకీ కూడా వచ్చేసింది. వాళ్ళ మమ్మీ డాడీలు ఆనందభరితులై పోయారు.

ఈలోగా వాళ్ళ సంగీతం టీచరు వాళ్ళకి చిన్నచిన్న పాటలు పాడ్డం కూడా నేర్పించారు. దాంతో ఆ పాటల ప్రతిధ్వని కూడా ఇంట్లో వినిపించడం మొదలైంది.

ఇదిలావుండగా తమకో బుల్లి సైకిల్ కావాలని శశి, హైమలు వాళ్ళనాన్న దగ్గర మారాం మొదలెట్టారు.



ఎంతబుల్లి సైకిలైతే మాత్రం మాటలా! అందునా రెండు చక్రాలది. కనీసం వెయ్యీ పన్నెండు వందలవుతుంది.

"అంత డబ్బు ప్రస్తుతం మనదగ్గర లేదమ్మా!" అంటూ వాళ్ళ డాడీ సైకిలు కొనడం వాయిదాలు వేస్తూ వస్తున్నారు.

ఓరోజు పొద్దున్న వాళ్ళ మమ్మీ "ఈరోజు మీ డాడీ పాట పాడి బోలెడు డబ్బు తెస్తారు" అని చెప్పింది.

ఆ సాయంత్రం వాళ్ళ డాడీ వచ్చే సరికి శశి, హైమలు ఆయన్ని చుట్టేశారు. "పాట పాడారా? డబ్బుతెచ్చారా?" అంటూ.

ఆయన కెంతో ఆశ్చర్యం కలిగింది. తను చీటీపాడి డబ్బుతెచ్చినట్టు పిల్లల కెలా తెల్సిందని!

"డబ్బు లొచ్చాయి. మీకు సైకిల్ కొంటాలే" అని వాళ్ళని సము దాయించారు.

"ఎప్పుడు కొంటారు సైకిల్?". కళ్ళు తిప్పుతూ అడిగింది శశి.

"రేపు సాయంత్రం వెళ్దాంలే" అన్నారాయన.

"వెరీగుడ్... డాడీ ఎంతో మంచివారు" అంటూ ఆయన్ని ముద్దులు పెట్టేసుకున్నారు శశి, హైమ. వాళ్ళ మమ్మీ ఎంతో ఆనందపడిపోయింది.

ముద్దుల పరంపర అయిపోయాక చిన్నారి హైమ అడిగింది "సరేకాని డాడీ! నాకూ ఆ డబ్బులొచ్చేపాట నేర్పించరా."

డబ్బులొచ్చేపాట నేర్పించడమా!? తెల్ల మొహాలేశారు మమ్మీ డాడీలెను.

పాట పాడ్డం అంటే ఘంటశాల లాగానో, ఎస్పీలాగానో బ్రహ్మాండంగా పాడేస్తే 'శభాష్' అని అందరూ డాడీకి డబ్బులిచ్చారనీ - ఆ చిన్న పిల్లల ఊహ కాబోలు - అందుకే అంతమంచి పాట తమకీ నేర్పించమని అమాయకంగా అడిగారు.

తను పాడిన పాట చీటీపాట అనీ- ఆ పాట సినిమా పాటలా అన్ని వాద్యాలతోనూ, వినసొంపుగా ఉండదనీ - వాళ్ళకి అర్థం అయ్యేలా ఎలా చెప్పాలో అర్థం కాక బిక్కు ముఖాలేశారు వాళ్ళ మమ్మీ డాడీలు!

★


ఆకెళ్ళ గిరిజ
21-138-2, ఫ్లాట్ నం.41
ఉత్తమ్‌నగర్, I క్రాస్,
హైదరాబాద్-47.